# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 26 అక్టోబరు 2024 | 7


# నదీకోత.. రైతులకు గుండెకోత!





గోపాయిలంక వద్ద వైనతేయ నదీకోతకు గురైన కొబ్బరితోటలు

## వైనతేయ గట్టు పరిశీలించిన ఏఈ, రైతులు

అల్లవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం గోపాయిలంక వద్ద తమ విలువైన కొబ్బరి తోటలు వైనతేయ గోదావరి నదీకోతకు గురవుతుందన్న రైతుల ఆవేదనపై శుక్రవారం ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఏఈ ఆచంట దుర్గానాయుడు పరిశీలించారు. ఆయనతోపాటు పలువురు రైతుప్రతినిధులు కోతకు గురైన కొబ్బరితోటలను పరిశీలించారు. గోదావరిలోకి కూలిపోయిన కొబ్బరి చెట్లను చూశారు. ఈ సందర్భంగా ఏఈ దుర్గానాయుడు మాట్లాడుతూ 2022లో అంచనాలు రూపొందించి ప్రతిపాదన పంపించామని, ప్రస్తుతం 450 మీటర్ల మేర కొబ్బరి తోటలు నదీకోత బారిన పడ్డాయన్నారు. తాజాగా నదీకోత నష్టాన్ని పరిశీలించామని, దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆయన వెంట రైతులు మాకిరెడ్డి సత్తిబాబు, రుద్రరాజు వెంకటనరసింహరాజు, నడింపల్లి సూరిబాబురాజు, మాకిరెడ్డి సూర్యచంద్రరాజు, అడపా కృష్ణప్రసాద్, నందెపు భాస్కరరామారావు ఉన్నారు.





మలయప్ప అలంకరణలో శ్రీవారు

# గోవిందా.. హరిగోవిందా..

- గోదావరి నదీజల సంగ్రహణం.. ఐదవ రోజు మహాలక్ష్మి హోమం
- మలయప్ప అలంకరణలో గరుడవాహనంపై శ్రీవారు
- వైభవంగా సాగుతున్న వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు





వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తజనం.. నృత్య ప్రదర్శన

# ఆంక్షలు లేవంటూనే..

- ధాన్యం విక్రయాల్లో రైతుల ఆప్షన్‌లో సరికొత్త మెలికలు
- మండలంలోని మిల్లులతోపాటు మరో పది మిల్లుల ట్యాగ్
- జిల్లా యూనిట్‌గా చేయాలని అధికారులకు రైతుల వినతి




కె.గంగవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలన్నింటినీ చెల్లించింది. దాంతో రైతులంతా ఒడ్డునపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం అమ్ముకోవడం, అమ్మిన ధాన్యానికి సొమ్ములు పొందడానికి రైతులంతా అష్టకష్టాలు పడ్డారు. అయితే ఇక నుంచి ధాన్యం అమ్మితే 48 గంటల్లోనే జమ చేస్తామని తాజాగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కొన్నిచోట్ల కొనుగోళ్లు కూడా మొదలై చెల్లింపులు జరుగుతున్నాయి. ఎక్కడా రైతులకు ఆంక్షలు లేవని, ఏ రైతు ఎక్కడైనా అమ్ముకోవచ్చని కూడా స్పష్టమైన హామీ లభించడంతో అన్నదాతలంతా ఆనందం వ్యక్తంచేశారు. కానీ ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం విక్రయాల్లో రైతుల ఆప్షన్ విషయంలో ఆంక్షలు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. రామచంద్రపురం డివిజన్‌లో మరో వారం రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. దీంతో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.. రామచంద్రపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు ఆరు మండలాల్లో 89 వేల ఎకరాల్లో వరిపంట ఈసారి సాగు అయ్యింది. సుమారుగా 2,30,474 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా. దీన్ని ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయడానికి 116 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయనున్నారు. నవంబరు ఒకట తేదీ నుంచి జనవరి ఒకటవ తేదీ వరకూ ధాన్యం కొనుగోలు చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇదంతా బాగానే ఉంది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. పండించిన పంటను ఏఏ మిల్లులకు పంపించుకుంటారో చెబితే ఆ మిల్లులను ఆయా రైతు సేవా కేంద్రాలకు ట్యాగ్ చేయిస్తామని చెబుతున్నారు. రైతుల సొంత మండలంలోని అన్ని మిల్లులుతోపాటు మరో 10 నుంచి 12 మిల్లులు వేరే మండలాల్లో ఉన్న వాటి చిరునామాలు కూడా చెబితే ట్యాగ్ చేయించుకుంటామని చెబుతున్నారు. ఈ నిర్ణయంతో రైతులు కంగుతింటున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లోను, తదుపరి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతులు తమ పంటను తమకు ఇష్టం వచ్చిన మిల్లులకు విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని ప్రకటించింది. తీరా ఆచరణలోకి వచ్చేసరికి ఇలాంటి ఆంక్షలు పెట్టడమేమిటని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఏ మిల్లుల వారు ఏ విధమైన ఆంక్షలు పెట్టకుండా ధాన్యం దింపుకుంటారో చూసుకుని ఆ మిల్లులకు ధాన్యం విక్రయించుకునే అవకాశం రైతులకు ఇవ్వాలని వీరంతా కోరుతున్నారు. అంతేకానీ అప్పుడు పది మిల్లులను ట్యాగ్ చేస్తే తరువాత ఆ పది మిల్లులకు మాత్రమే ధాన్యం విక్రయించాలంటారని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా మిల్లుల దగ్గర బ్యాంకు గ్యారంటీ సమస్యలు ఉంటాయి. అప్పుడు రైతు తనకు ఇష్టం వచ్చిన లేదా సక్రమంగా దింపుకుంటున్న మిల్లులకు ధాన్యం విక్రయించవుకునే అవకాశాన్ని కోల్పోతాడని వారంతా వాపోతున్నారు. ఇలాకాకుండా ధాన్యం విక్రయాల సమయంలో డివిజన్ పరిధిలో ఉన్న సుమారు 112 రైస్ మిల్లులు ప్రతీ రైతు సేవా కేంద్రాల్లోను కనిపిస్తే రైతు తనకు నచ్చిన మిల్లుకు ధాన్యం విక్రయించుకునే వీలుంటుంది. అందువల్ల ధాన్యం విక్రయాల సమయంలో ప్రతీ రైతు సేవా కేంద్రంలోను 112 రైస్ మిల్లులు ట్యాగ్ చేయాలని రైతులు కోరుతున్నారు.

## ముందస్తు అనుమతులు లేకుండా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేస్తే చర్యలు : కలెక్టర్

అమలాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ముందస్తు అనుమతులు లేకుండా ఎవరైనా బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లాకలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే బాణసంచా సామగ్రి విక్రయించడానికి అనుమతి ఉందన్నారు. అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటూ ప్రమాదాలు జరగకుండా దుకాణాలు నిర్వహించాలని యజమానులకు సూచించారు. అధికారులు జారీ చేసిన తాత్కాలిక లైసెన్సులు పొందినవారు మాత్రమే దుకాణాలు నిర్వహించాలన్నారు. దుకాణదారులు రెవెన్యూ, పోలీసుల, అగ్నిమాపకశాఖ అధికారుల వద్ద ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. మండలంలో దరఖాస్తు చేసుకున్న తరువాత ఆర్డీవో అనుమతులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు.

## మూడు గ్యాస్ సిలిండర్లు ఉచిత పథకానికి శ్రీకారం : జేసీ



అధికారులకు వివరాలు వెల్లడిస్తున్న జేసీ

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టినట్టు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. తొలుత శుక్రవారం అమరావతి నుంచి పౌర సరఫరాలశాఖ కమిషనర్ జి.వీరపాండ్యన్, డీసీఎస్ మనజీర్ జిలానీలు జేసీలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, చౌకధరల దుకాణాల నిర్వహణ, ధరల నియంత్రణ అంశాలపై జేసీలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం అమలులో ఉన్న గ్యాస్ కనెక్షన్ నంబరు, ఆధార్, రైసుకార్డు నంబరు డేటాబేస్‌లో ఉన్నవారు ఈ పథకానికి అర్హులవుతారన్నారు. లబ్ధిదారులు ఈ నెల 29 నుంచి మార్చి 30లోపు ఒక సిలిండర్‌ను బుక్ చేసుకోవాలన్నారు. లబ్ధిదారుడు గ్యాస్ సిలిండర్ ధరను ఆన్‌లైన్‌లోగానీ, ఆఫ్‌లైన్‌లోగానీ చెల్లించాలన్నారు. ఆ తరువాత లబ్ధిదారుని ఖాతాకు ఆయిల్ కంపెనీ సబ్సిడీని జమ చేస్తుందన్నారు. సిలిండర్ పొందిన 24 గంటల లోపల సబ్సిడీ సొమ్ములు జమ అవుతాయన్నారు. ఈఏడాది ఒక సిలిండర్ పొందవచ్చని, ఆ వినియోగదారుడు వచ్చే ఏడాది మూడు బ్లాకుల్లో ఉచిత సిలిండర్లు పొందవచ్చన్నారు. అనంతరం ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించారు. రైతులు బహిరంగ మార్కెట్‌లో తాము పండించిన ధాన్యానికి అధిక ధర లభించినట్టయితే అమ్ముకోవచ్చునన్నారు. అయితే ధాన్యం వివరాలను సంబంధిత రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. నవంబరు 6 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. కందిపప్పు, పంచదార నవంబరు నెలకి అందుబాటులో ఉంచామని, ఎడిబుల్ ఆయిల్స్ ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, సహాయ మేనేజర్ నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

## జిల్లాలో రూ.53 కోట్లతో 750 పనులు

- సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా చర్యలు
- పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి





పి.గన్నవరంలో జరిగిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ రామకృష్ణారెడ్డి

పి.గన్నవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పంచాయతీరాజ్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా రూ.53 కోట్లతో 750 పనులు చేపట్టనున్నట్టు పంచాయతీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. పి. గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వారంరోజులపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెపండుగలో భూమి పూజలు చేశారని ఆయన తెలిపారు. ఆయా పనులను వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశామన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో రోడ్లకు ప్రారంభోత్సవాలు ఉంటాయన్నారు. అదేవిధంగా నిబంధనలు అనుసరించి రహదారులన్నీ పూర్తి పారదర్శకంగా ఉండేవిధంగా చూడాలని అధికారులను కోరారు. గ్రామ స్థాయిలో జరిగే పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ అత్యంత నాణ్యత ప్రమాణాలతో రహదారులను నిర్మించే విధంగా చూడవల్సిన బాధ్యత మీపై ఉందని సిబ్బందికి సూచించారు. దీనిపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రోడ్ల నిర్మాణంలో పాటించవల్సిన పలు అంశాలపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ వి.చంద్రశేఖర్, జేఈలు కృష్ణంరాజు, ఆనంద్, నియోజకవర్గ టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.







దుర్గారావు కుటుంబానికి గృహం కేటాయింపు పత్రం అంద జేస్తున్న మంత్రి సుభాష్. గృహం కేటాయింపు పత్రంతో దుర్గారావు, భార్య, కుమారుడు.. అంతకుముందు ఉన్న నివాసం

## బీదకుటుంబానికి.. గూడు దొరికింది..

### సిమెంటు తూర నుంచి టిడ్కో గృహ ప్రవేశం.. అందజేసిన మంత్రి సుభాష్

### 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించి 40 రోజుల్లో గృహం కేటాయింపు

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): గూడులోని బీదకుటుంబానికి గూడు దొరికింది. రామచంద్రపురంలో వెల్లవంతెన వద్ద పదేళ్లగా రోడ్డుపక్క సిమెంటు తూరను నివాసంగా మార్చుకుని జీవనం సాగిస్తున్న మడిమి దుర్గారావు కుటుంబానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం టిడ్కో ప్లాటును అందజేశారు. దీంతో గూడులేని తమకు గృహం దక్కడంతో మడిమి దుర్గారావు తన కుటుంబంతో గృహంలో అడుగుపెట్టారు. మడిమి దుర్గారావుకు పూర్తి బధిర మహిళ అయిన భార్య, కుమారుడుతో పదేళ్లగా సిమెంటు జీవనం సాగిస్తున్న వైనంపై 'గూడులేని బతుకు' శీర్షికన సెప్టెంబరు 16 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఈ కథనంపై స్పందించిన మంత్రి సుభాష్ వెంటనే దుర్గారావు కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేసి టిడ్కో గృహం అందజేస్తానని హామీ ఇచ్చారు. హామీ మేరకు మడిమి దుర్గారావు భార్య మడిమి దుర్గమ్మ పేరుతో టిడ్కో గృహం కేటాయించారు. శుక్రవారం మడిమి దుర్గారావు కుటుంబంతో వేదమంత్రాల నడుమ మంత్రి సుభాష్ గృహ ప్రవేశం చేయించారు. మంత్రి సుభాష్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, దుర్గారావు కుమారుడు చేతులమీదుగా రిబ్బన్ కత్తిరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టిశ్రీదేవి, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మంత్రి సుభాష్ తండ్రి సత్యం గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. దుర్గారావు కుటుంబానికి నూతన వస్త్రాలు, దుప్పట్లు, నిత్యావసర వస్తువులు మంత్రి సుభాష్ తండ్రి సత్యం అందజేశారు. వారితోపాటు వారి బంధువులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే మరో రెండు నిరుపేద కుటుంబాలకు కూడా మంత్రి సుభాష్ టిడ్కో ఇళ్లు అందజేశారు. దోమలపాటి నవిత, కొమ్మూరి ప్రమీలకు కూడా టిడ్కో గృహం కేటాయింపు పత్రాలు ఇచ్చి గృహ ప్రవేశం చేయించారు.



అయినవిల్లిలో విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనుల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

## రూ.206 కోట్ల వ్యయంతో విద్యుత్ ఉపకేంద్రం

### నిర్దేశిత గడువులోగా నిర్మాణం పూర్తిచేయాలి : కలెక్టర్ మహేష్‌కుమార్

అయినవిల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడంతోపాటు లోఓల్టేజ్ సమస్యలను అధిగమించేందుకు నూతన విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణాన్ని చేపట్టినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లిలో నూతనంగా నిర్మిస్తున్న 400 కేవీ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. రూ.206 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఉపకేంద్రం నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని మెగా ఇంజనీరింగ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. గృహ అవసరాలతోపాటు రైతులు, పారిశ్రామిక, ఆక్వా రంగాలకు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి వేగవంతంగా తీసుకురావాలని సూచించారు. రావులపాలెం నుంచి అయినవిల్లి వరకు సుమారు 36 టవర్లను నిర్మించి నిరంతరం విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఆ ప్రాంతంలో ఉత్పన్నమవుతున్న విద్యుత్ సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, డీఈఈలు పుల్లయ్య, రవికుమార్, విజయానంద్ ఉన్నారు.

## 'భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి'

అమలాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల మధ్య రహదారుల అనుసంధానంతో ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు జాతీయ రహదారులు, రైల్వే లైన్ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలను ఆదేశించారు. శుక్రవారం ఆమె సంయుక్త కార్యదర్శులతో కలిసి అమరావతి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి భూసేకరణ ప్రక్రియపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసిందన్నారు. ఆ దిశగా అధికారులు భూసేకరణ పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రగతి పరుగులకు మార్గం సుగమం చేసేలా జాతీయ రహదారులు రైల్వే ప్రాజెక్టు అథారిటీలు, రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్‌తో ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టులు మంజూరైనా భూసేకరణ పూర్తికాకపోవడం, వివిధ క్లియరెన్సులు, కోర్టు కేసుల అంశాలపై సమీక్షించారు. సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుని ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతితోపాటు అధికారులు పాల్గొన్నారు.

# ఆహారమే.. ఆరోగ్యం!

మనుషుల జీవన విధానంలో ఎప్పటికప్పుడు మార్పులొస్తుంటాయి. అలవాట్లు, ఆహారం విషయాలు అనేక మార్పులు చేర్పులకు ప్రభావితం అవుతుంటాయి. ఆహారంపై నవీన పద్ధతులను అనుసరించేవారు ఓవైపు, ఆధునిక జీవనంలో కూడా ఆరోగ్యమే ప్రధానంగా చక్కటి ఆహారపు నియమాలతో కొనసాగేవారు మరొకవైపు కనిపిస్తారు. ముఖ్యంగా కొవిడ్ తర్వాత వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చాలా మందికి పెరిగింది. దైనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించే విధానాలకు ఎంతో మంది ఆకర్షితులవుతున్నారు. రోజూ నడక, వ్యాయామంతోపాటు మంచి ఆహారాన్ని పొందడమూ చాలా ముఖ్యమని భావిస్తున్నారు. దానికి అనుగుణంగానే సేంద్రియ పద్ధతుల్లో పండించిన ఆహారాన్ని స్వీకరించే వారి సంఖ్యా పెరుగుతోంది. దాంతో పొద్దుటే మార్నింగ్ వాక్ చేసే పార్కుల వద్దే రాగి జావ, జొన్న జావా, కొర్రల జావా, రాగి సంగటి ఇలా ఆరోగ్యకర ఆహారాన్ని విక్రయిస్తున్నారు. అలాగే చిరు, తృణధాన్యాలతో చేసిన మిల్లెట్ ఇడ్లీ, ఉప్మా, పొట్టిక్కలు వంటి ఎన్నో రకాల అల్పాహారాల అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి. ఇక జ్యూస్‌ల సంగతి.. ఇది వరకు పండ్ల రసాల జ్యూస్‌లు, లస్సీలు ఆరోగ్యం కోసమంటూ తాగేవారు. ఇటీవల కూరగాయలతో జ్యూస్‌ల వినియోగం బాగా పెరిగింది. ఆస్పత్రుల సమీపంలో కాకరకాయ జ్యూస్ స్పెషల్ అనో, బూడిదగుమ్మడి జ్యూస్ తమ ప్రత్యేకత అనో బోర్డులు కనిపిస్తున్నాయి. ఆరోగ్యమే మహాభాగ్యం అంటారు. మంచి ఆహారమే మంచి ఆరోగ్యం అన్నది నేటి ట్రెండ్..










## ఉదయాన్నే జావతో మొదలు.. ఆకలేస్తే మిల్లెట్ ఇడ్లీ.. వెజిటబుల్ జ్యూస్‌లు.. పెరుగుతున్న ఆరోగ్య స్పృహ

### జావ తాగేద్దాం.. మొలకలూ లాగిద్దాం!

తెలతెల్లవారుతుండగా.. అలా వాకింగ్‌కి వెళ్లి.. సూర్యోదయం కావొస్తున్న వేళ వేడి వేడి రాగి జావ తాగేవారు లక్షల్లో ఉంటారు. ఇవాళ ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతుండడంతో రాగి జావకు యమగిరాకీ పెరిగింది. అందులోనూ తక్కువ ఖర్చుతో సిద్ధమైపోతుంది. ఈ అవకాశాన్ని యువకులు ఒడిసి పట్టుకొని.. ఉదయం వేళ పట్టుమని ఓ నాలుగు గంటలు కేటాయించి జనాలకు ఆరోగ్యమిస్తూ.. ఇటు వీళ్లూ ఉపాధి పొందుతున్నారు. రాగి ముద్ద, రాగి ఇడ్లీ, రాగి దోసెలు, రాగి లడ్డు వంటివి కూడా ఈ మధ్య విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నాయి. వీటిలో రాగి జావ తీరే వేరు. వాస్తవానికి చిరు ధాన్యాలను సిరి ధాన్యాలుగా పిలుస్తారు. అవి ఆరోగ్యానికి చేసే మేలు అపారమని వైద్యులూ చెబుతుంటారు. ఈ మధ్య ఆహారంలో కూడా చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు ప్రధానంగా మారిపోయాయి. ఆ సిరి ధాన్యాల్లో రాగులను రారాజుగా చెప్పవచ్చు. వీటినే ఫింగర్ మిల్లెట్స్ అంటారు. ఈ తరం వాళ్లకు తెలియకపోవచ్చుగానీ ఒకప్పుడు రాగి మాల్ట్‌ని పిల్లలు ఇష్టంగా తాగేవాళ్లు. తర్వాత రసాయన సమ్మేళనాలతో వచ్చే పొడుల రుచికి అలవాటుపడిపోయారు. ఇప్పుడు మళ్లీ రాగి మాల్ట్ ట్రెండ్ ఉరకలు పెడుతోంది. రోడ్డు పక్కన చిన్న బడ్డీల్లో రాగి జావను ఉదయంపూట విక్రయిస్తున్నారు. తక్కువ స్థలం, తక్కువ పెట్టుబడి, ఎక్కువ ప్రయోజనకరంకావడంతో యువత ఇటువైపు మళ్లుతోంది.






గోదావరి గట్టున వాకింగ్‌కు వచ్చిన వారికి రాగి, కొర్రలు తదితర జావలను విక్రయిస్తున్న దృశ్యం

రాగి పిండి తక్కువ ధరకే దొరకడం, స్పూను పిండితోనే సుమారు అర లీటరు రాగి జావ తయారుకావడంతో పావులీటరు గ్లాసు రూ.10కే అందుబాటులోకి వచ్చింది. దీనికి మజ్జిగ, జీలకర్ర పొడి, మిరియాల పొడి, నిమ్మ రసం కూడా జత చేస్తూ రుచిని రెట్టింపు చేస్తున్నారు. కొన్నిచోట్ల రాగిజావతోపాటు జొన్న జావ, కొర్రల జావ, రాగి సంకటి వెజిటబుల్ సూప్, మొలకెత్తిన పెసలు, ఉడకబెట్టిన సెనగలు, స్వీట్‌కార్న్, కీర బీట్‌రూట్ క్యారెట్, కాకర ముక్కలు, నానబెట్టిన బాదం గింజలు, ఉడకబెట్టిన గుడ్లు, రాగి తోపా, చిమిలి వంటివీ విక్రయిస్తున్నారు. వీటి ధర కూడా రూ.10 మాత్రమే. అవన్నీ కూడా శరీరానికి మరింత మేలు చేసేవేకావడంతో లొట్ట లేసుకొని తాగడంతోపాటు ఇళ్లకూ పార్సిల్ తీసుకెళ్తున్నారు. నిజానికి రాగి జావను సూపర్ ఫుడ్‌గా చెబుతారు. రాగి జావలో ప్రధానంగా 'ఎలుసినియన్' అనే ప్రొటీన్ ఉంటుంది. దీనికి జీవ ప్రక్రియలో అధిక ప్రాధాన్యం ఉంది. ప్రొటీన్, కార్బొహైడ్రేడ్స్, ఖనిజ లవణాలు, ఈ, సీ విటమిన్లు, కాల్షియం, మెగ్నీషియం, పాస్పరస్, కొవ్వులు, ఫైబర్, బీ కాంప్లెక్స్ థయమిన్, నియాసిన్, రిబోఫ్లేవిన్‌ని శరీరం పొందుతుంది. రాగిపిండి సహజ ఐరన్ కూడా. కాల్షియం, ఇనుము ఎముకలను బలోపేతం చేస్తాయి. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. బీపీ హద్దుల్లో ఉంటుంది. రాగి జావలో ఉండే మెగ్నీషియం, డైటరీ ఫైబర్, పాలీఫినాల్స్ వంటివి రక్తంలోని గ్లూకోజ్‌ని నియంత్రించడం వల్ల షుగర్‌తో బాధపడే వాళ్లకు మేలు కలుగుతుంది. అధిక బరువును తగ్గించుకోవచ్చు. కాలేయ వ్యాధులు దూరమవుతాయి. జీర్ణక్రియకు రాగులు దోహదపడతాయి. - రాజమహేంద్రవరం/ఆంధ్రజ్యోతి



### మిల్లెట్ ఇడ్లీ, పొట్టిక్కలు..

చిరు, తృణధాన్యాలతో చేసిన అల్పాహారానికి కూడా మార్కెట్‌లో చాలా గిరాకీ పెరిగింది. ఇదివరకు వాకింగ్‌కు వెళ్లేవారు, క్రీడాకారులు, జిమ్‌లకు వెళ్లేవారు మాత్రమే వీటివైపు చూసేవారు. ఇప్పుడు చాలా మంది మిల్లెట్ ఇడ్లీ, తృణధాన్యాలతో చేసిన అల్పాహారాలు ఎక్కువగా తీసుకుంటున్నారు. దాంతో అయా అల్పాహారాలు అందించే దుకాణాలు సైతం విరివిగా పెరిగాయి. చిరుధాన్యాలతో దాదాపుగా అన్ని రకాల ఆహారాన్ని తయారుచేసే విధానం కూడా బాగా పెరిగింది. ఇళ్ల దగ్గరకన్నా మార్కెట్‌లో సులువుగా దొరుకుతుండడంతో ఈ బిజినెస్ పెరిగింది.

### ఆరోగ్యం కోసం వెజిటబుల్ జ్యూస్

కొందరు ఫాస్ట్‌ఫుడ్లకు అలవాటు పడుతుంటే, మరికొందరు మంచి ఆరోగ్యానిచ్చే ఆహారాన్ని స్వీకరిస్తున్నారు. వైద్యులు కూడా ఫాస్ట్‌ఫుడ్లు మాని కూరగాయలు, ఆకుకూరలు తినమని సలహా ఇస్తున్నారు. కొవిడ్ తర్వాత చాలామంది విటమిన్స్ కలిగిన ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆకుకూరలు, కూరగాయలు జ్యూస్‌లు తాగడం మొదలెట్టారు. దీంతో నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేకంగా వెజిటబుల్ జ్యూస్ సెంటర్లు వెలిశాయి. అనారోగ్యకరమైన ఆహారం, బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతోంది. ఇది గుండె ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని, సమతుల్య ఆహారం పాటించాలని, ఇంట్లో తయారుచేసిన కూరగాయల రసం తాగాలని వైద్యులు కూడా సూచిస్తున్నారు. ప్రకృతిలో లభించే ఆకుకూరలు, కూరగాయల్లో ఆరోగ్యానికి మేలు చేసే వివిధ రకాల గుణాలుంటాయి. కూరల్లానే కాకుండా.. జ్యూస్ రూపంలో తీసుకున్నా అద్భుత ప్రయోజనాలు చేకూరుతాయి. దీంతో ఈ వ్యాపారం జోరుందుకుంది. పార్కులు, క్రీడాస్థలాలు, ఆసుపత్రుల వద్ద వీటి అమ్మకాలు జరుగుతున్నాయి. ఇక ఏ కూరగాయ రసం దేనికి ఉపయోగపడుతుందో చూద్దాం.

బీట్‌రూట్ : బీట్‌రూట్ రసంతో కంటిచూపు మెరుగుపడుతుంది. అజీర్తి, పెప్టిక్ అల్సర్, కడుపునొప్పి సమస్యలకు మంచి పరిష్కారం. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరగాలంటే బీట్‌రూట్‌కు మించింది మరొకటి లేదు.

కారెట్ జ్యూస్ : కారెట్ జ్యూస్‌లో అధికంగా ఉండే విటమిన్ ఏ కంటికి మంచిది. కేన్సర్ కణాల్ని నిరోధించే గుణం కారెట్‌లో ఉంది. కొలెస్ట్రాల్‌వంటి సమస్యలున్నవారికీ మంచిది.

కీర, దోసకాయ జ్యూస్ : కీరా లేదా దోసకాయ జ్యూస్‌తో అన్ని రకాల కడుపు సంబంధిత సమస్యలు దూరమవుతాయి. దోసకాయ ఒంటికి చలువ కలిగిస్తుందని చెబుతున్నారు.

బూడిద గుమ్మడి జ్యూస్: ఈ జ్యూస్ క్రమం తప్పకుండా తీసుకుంటే.. కిడ్నీలో రాళ్ల సమస్య, స్త్రీలలో రుతు సమస్య, అధిక రక్తస్రావం, మలబద్దకం, ఎసిడిటీ వంటివి దూరమవుతాయి.

అలోవెర ఉపయోగాలు : వేడి తగ్గించడం, పైల్స్ తగ్గించడంతోపాటు రాకుండా ఉండటానికి, మానసిక రుగ్మతల నుంచి ఉపశమనం.

గోధుమగడ్డి జ్యూస్: రక్తసిద్ధి, కొలస్ట్రాల్, బ్లడ్ ప్రెజర్ చర్మవ్యాధులు, మధుమేహం, రోగనిరోధకశక్తికి ఉపయోగపడుతుంది.

ఉసిరి జ్యూస్: కాలేయ సమస్య ఉంటే ఉసిరి రసాన్ని తయారుచేసి తేనెతో కలిపి తినాలి. ఇది కాలేయాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. జాండిస్‌తో బాధపడుతున్న వారికి ఉపశమనం కలుగుతుంది. ఖాళీ కడుపుతో ఉసిరికాయ రసం తాగడం వల్ల త్వరగా బరువు తగ్గవచ్చు.

పాలకూర జ్యూస్: రక్తపోటును నియంత్రిస్తుంది. పాలకూర నీటిలో సహజంగా లభించే నైట్రేట్‌లు అధికంగా ఉంటాయి. రక్తనాళాలను విస్తరించడంలో సహాయపడే ఒక రకమైన సమ్మేళనం, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. రక్తప్రసరణను పెంచుతుంది. గుండె సంబంధిత వ్యాధులను నివారిస్తుంది.

కాకరకాయ జ్యూస్: ఈ జ్యూస్ పరగడుపున తాగితే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కాకరకాయలో యాంటి ఆక్సిడెంట్లు, యాంటీ అలర్జీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి.

మునగాకు జ్యూస్: మునగాకులో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఆకుల్లో నారింజ కంటే 7 రెట్లు ఎక్కువ విటమిన్ సి, అరటిపండ్ల కంటే 15 రెట్లు ఎక్కువ పొటాషియం ఉంటుంది. ఇది కాల్షియం. ప్రొటీన్ ఐరన్, అమైనో యాసిడ్‌లను కూడా కలిగి ఉంది.

జ్యూస్ ధరలు ఇలా :

ఏ జ్యూస్ అయినా కాకినాడ నగరంలో రూ.30, విటమిన్ ఏ, బీ, సీ జ్యూస్ అయితే రూ.60, గోధుమగడ్డి జ్యూస్ రూ.40, మిక్స్ వెజిటేబుల్స్ జ్యూస్ రూ.40 విక్రయిస్తున్నారు.

- కాకినాడ కార్పొరేషన్/ఆంధ్రజ్యోతి

# గోవిందా...హరి గోవిందా

- ఐదోరోజు బ్రహ్మోత్సవాల్లో మహాలక్ష్మి హోమం
- భక్తి శ్రద్ధలతో గోదావరి నదీజల సంగ్రహణం
- మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై శ్రీవారు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

ఆత్రేయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిపారు. స్వామివారి ఉత్సవమూర్తులను పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడ్ని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి పూజలు అందుకున్నారు. వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం.. ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, పంచామృత మండపారాధన, అభిషేకాలు, హోమాలు, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు జరిపారు. మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా వెళ్లి గోదావరి నదీజల సంగ్రహణ నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి మూలమంత్ర పూర్వక మహాలక్ష్మి హోమం వేదమంత్రాల సాక్షిగా జరిపారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కనక దుర్గాదేవి దంపతులు బ్రహ్మోత్సవ పూజలు చేశారు. వివిధ రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉర్రుతలూగించాయి. విద్యుత్ దీపాలంకరణ, మంగళ వాయిద్యాలతో పాటు సుగంధ పరిమళాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య స్వామివారి క్షేత్రం పులకించింది. ఫొటోషూట్‌ల వద్ద భక్తులు సందడి చేశారు. రాత్రి మలయప్ప అలంకరణతో అలంకృతుడైన శ్రీవారు గరుడ వాహనంపై ఆశీలనులయ్యారు. వేదఘోష, మిరుగొట్లు గొలిపే బాణసంచా కాల్పుల మధ్య తిరువీధుల్లో స్వామివారు విహరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు కూటమి నాయకులు, ముదునూరి వెంకట్రాజు, సత్యశావణి దంపతులు, కాయల జగన్నాథం, మంగాదేవి దంపతులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.

#### నేడు వాడపల్లిలో ...

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు శనివారం మహాపుష్ప యాగము, శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారి సూర్యప్రభ వాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ, మోహిని అలంకరణతో చంద్రప్రభ వాహనసేవ నిర్వహిస్తారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు పాల్గొంటారు.

#### బ్రహ్మోత్సవాలకు ఊరారా ప్రచారం

వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకు జరగనున్నాయి. భక్తులు వీటిని తిలకించేలా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ఉచిత బస్సులు ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలు తిలకించే ఏర్పాట్లు చేశారు. ఆటోల్లో సిబ్బంది విస్తృత ప్రచారం చేస్తున్నారు.



#### శ్రీవారికి కురువేరు దండ

##### ఖరీదు కిలో రూ.10వేలు

శ్రీ వేంకటేశ్వరస్వామికి ఎంతో ప్రీతికరమైన కురువేరు దండ ప్రాముఖ్యత సంతరించుకుంది. తమిళనాడు, కేరళ సముద్రతీరం వెంబడి నేలలో పెరిగే కురువేరు దండ ఎంతో ఖరీదైనది. కిలో రూ.10వేల నుంచి రూ.12వేలు పలుకుతుంది. ప్రతిఏటా స్వామివారి బ్రహ్మోత్సవాలకు దాన్ని ఉపయోగిస్తారు. గరుడ వాహనంపై విహరించే శ్రీవారికి ఈ దండను వేస్తారు.



వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులకు అభిషేకం చేస్తున్న వేద పండితులు



లక్ష కుంకుమార్చన పూజలు చేస్తున్న దృశ్యం



మహిళా భక్తుల సాంస్కృతిక ప్రదర్శన


# నేటి నుంచి ఆధ్యాత్మిక పర్యాటక యాత్ర

## టూరిజం బస్సును ప్రారంభించనున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో వారాంతపు ఆధ్యాత్మిక యాత్రకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్‌లో ఉన్న టూరిజం ఆర్డీ ఆఫీసు నుంచి ఉదయం 6 గంటలకు బస్సును ప్రారంభించనున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక దేవాలయాలు, పంచారామ క్షేత్రాలు సందర్శించేవారి కోసం ప్రత్యేక ప్యాకేజీ నిర్ణయించారు. తొలుత భక్తులకు ఆధ్మాత్మిక సాంత్వన కలిగించడానికి ఆరు పుణ్యక్షేత్రాలతో ఈ యాత్రకు శ్రీకారం చుడుతున్నారు. కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం ఈ యాత్ర ఉంటుంది. రాజమహేంద్రవరం సరస్వతీ ఘాట్ టూరిజం శాఖ ఇన్ఫర్మేషన్ అండ్ రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం(ఐఆర్‌వో) వద్ద ప్రతి శనివారం ఉదయం 6గంటలకు బస్సులు బయలుదేరతాయి. ఈ యాత్ర రాత్రి 7.30 గంటల వరకు కొనసాగుతుంది.

### యాత్ర ఇలా:

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి దర్శనంతో యాత్ర మొదలవుతుంది. అనంతరం అన్నవరం సత్యనారాయణస్వామి, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, సామర్లకోటలోని చాణుక్య కుమార రామ భీమేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అక్కడ మధ్యాహ్నం అన్న ప్రసాదాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత ద్రాక్షారామంలోని భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. చివరగా వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు.



### టికెట్ ధరలు

పెద్దలకు టికెట్ ధర రూ.1000 నిర్ణయించారు. మూడు నుంచి పదేళ్లలోపు వయస్సు గల చిన్నారులకు రూ.800 నిర్ణయించారు. శుక్రవారం రాత్రి 10 మంది యాత్రికులు టికెట్లు బుక్ చేసుకున్నారు. ఈ బస్సులో 18 మంది యాత్రికులు ప్రయాణించవచ్చు.

### ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి మంత్రి దుర్గేష్

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో తొలిసారిగా ఒకరోజు ఆధ్మాతిక యాత్రను ప్రారంభిస్తున్నట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో కొందరు ఎమ్మెల్యేల సూచన మేరకు ఈ యాత్ర ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. భక్తులను రద్దీని బట్టి బస్సులు ఏర్పాటు చేస్తామని, ఆదివారం కూడా యాత్రను కొనసాగించే ఆలోచన చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

# పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబు

**నేటి నుంచి ప్రారంభం**

మామిడికుదరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామి పవిత్రోత్సవాలకు అప్పనపల్లి ముస్తాబైంది. శనివారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం ఉదయం విశ్వక్సేనారాధనతో ప్రారంభమయ్యే పవిత్రోత్సవాల్లో భాగంగా పలు పూజలు ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు జరిగే పవిత్రోత్సవాలను పురస్కరించుకుని పలు పూజలు నిర్వహించి శ్రీవారి శాంతి కల్యాణాన్ని జరపనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ త్రిదండి చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు, గొడవర్తి శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతిష్ఠతో సమానమైన పవిత్రోత్సవాల ద్వారా శ్రీవారిలో విశేషమైన తేజస్సు కలుగుతుందని తెలిపారు. భక్తులకు సమర్పణ చేసే పూజా ద్రవ్యాల ద్వారా పుష్పాలు, వస్త్రాలు మనసా వాచా కర్మణా జరిగే దోషాలు పరిహారమవుతాయని వారంటున్నారు. భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొనాలని సహాయ కమిషనర్ కోరారు.



పవిత్రోత్సవాలకు చలువ పందిళ్లు వేస్తున్న సిబ్బంది



పవిత్రోత్సవాలకు ముస్తాబైన బాలబాలాజీ ఆలయం

# విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదం

## జిల్లా కలెక్టర్ షాన్ మోహన్




విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు

పిఠాపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ తెలిపారు. కాకినాడ జిల్లా పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల ఫ్యూచర్-2024 సైన్స్ ఫెయిర్, ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన అంశాలు ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. ప్రాజెక్టులు, ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి జి.వెంకటరావు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ వినీల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీవీ వెంకట త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



## మత్స్యకారుల వలలో 20 అడుగుల కొండచిలువ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సలాదివారిపాలెం వారధి వద్ద గోదావరి నదీ పాయలో మత్స్యకారుల వలలో 20 అడుగుల భారీ కొండచిలువ చిక్కింది. దానిని వారు నది ఒడ్డున వదిలేసి వెళ్లిపోయారు. చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. రెండేళ్ల క్రితం ఈ కొండచిలువ సలాదివారిపాలెం వారధి వద్ద పశువుల్లంక వైపు సంచరించడాన్ని గుర్తించామని... ఇవతల వైపునకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో మత్స్యకారుల వలలో చిక్కుకుని ఉండవచ్చని స్థానికులు చెప్పారు.

- ముమ్మిడివరం



## తలుపులమ్మ అమ్మవారికి ఐజీ పూజలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీవీ అశోక్‌కుమార్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం మహా మండపంలో వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు మహాప్రసాదం అందజేసి ఆలయ చరిత్ర, విశిష్టతను వివరించారు.

- తుని రూరల్

కార్తీక మాస ఏర్పాట్లపై

## రేపు సమీక్ష

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న ప్రారంభం కానున్న కార్తీక మాసంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, స్వామివారి తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ ఏర్పాట్లపై ఆదివారం అన్నవరం దేవస్థానంలో సమీక్ష జరగనుంది. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా, రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, అగ్నిమాపక, విద్యుత్, ఆర్టీసీ శాఖల ఉన్నతాధికారులతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. దేవస్థానం సుమారు రూ.80 లక్షలతో కొనుగోలు చేసిన బస్సులను ఉదయం 9 గంటలకు ఈవో ప్రారంభిస్తారు. మరోపక్క అదేరోజున భక్తులు సత్యదీక్ష స్వీకరించనున్నారు. ఇప్పటికే సుమారు 1,500 మందికి దీక్షా వస్త్రాలు, మాలలను దేవస్థానం తరపున ఉచితంగా అందజేశారు.



ఆశీర్వచనం ఇస్తున్న వేద పండితులు

సత్యదేవుని సన్నిధిలో విజయ రాజేశ్వరీ

## శ్రీవిద్యా పీఠాధిపతి

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి విజయవాడ సమీపంలోని విజయ రాజేశ్వరీ శ్రీవిద్యా పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామీజీ శుక్రవారం విచ్చేశారు. ఆయనకు ఏపీ ఆర్వో ఎం.గణపతి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామీజీ వెంట శిష్యులు విజయ భూమానందగిరి, శివప్రియానందగిరి వున్నారు.

ఇద్దరు వ్రత పురోహితుల

## సస్పెన్షన్

నలుగురు సూపర్‌వైజర్లకు చార్జి మెమో

అన్నవరం, అక్టోబరు 25: అన్నవరం దేవస్థానంలో సెకండ్‌గ్రేడ్ వ్రత పురోహితులుగా పనిచేస్తున్న రాయప్రోలు ఎస్‌వీఎస్ శ్రీరామచంద్రమూర్తి, పెండ్యాల వీఆర్‌టీకే శర్మ (రాము)లను సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వ్రత మాచరించే భక్తుల నుంచి దానాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న వేర్వేరు ఫిర్యాదుల మేరకు వారిద్దరిపై ఈ చర్యలు తీసుకున్నారు. వారి డ్యూటీ సూపర్‌వైజర్లు చామర్తి కన్నబాబు, గుత్తిన శ్రీనివాస్, చామర్తి జగ్గారావు, పొన్నపల్లి శాస్త్రిలకు చార్జి మెమో ఇచ్చారు. ఈవో శుక్రవారం ఉదయం తన కార్యాలయంలో వ్రత పురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. భక్తులు ఇచ్చింది సంతృప్తిగా తీసుకోవాలని... వ్రతం పూర్తయిన అనంతరం వస్త్రదానం, అన్నదానం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్తీక మాసంలో వ్రత మాచరించే భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. ఉత్తర్వులకు అనుగుణంగా వ్రతాలు ప్రారంభించాలని కోరారు.

### అత్యాచారయత్నానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్టు

పి.గన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఈ నెల 23న ఆరవై ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన లంకె సత్యనారాయణపై బాధితురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తులో భాగంగా అందిన సమాచారంతో సత్యనారాయణను ఆయన నివాసంలో సీఐ ఆర్.భీమరాజు అరెస్టు చేశారని ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. నిందితుడిని కొత్తపేట జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.





నన్నయ విశ్వవిద్యాలయం బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులతో రిజిస్ట్రార్ సుధాకర్

## నన్నయ వర్శిటీకి మరింత గుర్తింపు తేవాలి

రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు తమ ప్రతిభతో నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడా బోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి. సుధాకర్ కోరారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని నన్నయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులు జరిగిన అంతర్ కళాశాలల పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ కం జట్టు ఎంపిక శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ టోర్నమెంట్‌కు హాజరైన వారిలో ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులతో పాటు మరో నలుగురిని నన్నయ విశ్వవిద్యాలయం జట్టు సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. వీరు నవంబరు ఒకటో తేదీ నుంచి బెంగళూరులోని క్రిస్ట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల, రెండో స్థానంలో జి.మామిడాడ డీఆర్కే రెడ్డి కళాశాల, మూడవ స్థానంలో పెనుగొండ ఎస్‌కేవీపీ కళాశాల, నాలుగో స్థానంలో ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల నిలిచాయి. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులైన రైల్వే కోచ్ ప్రసాద్, బాపిరెడ్డి, పరిశీలకుడు రమణ, కోర్సు కో-ఆర్డినేటర్ కె.బాలసత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, బి.రామ్‌గోపాల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న రామచంద్రపురం ప్రభుత్వ కళాశాల క్రీడాకారులు

**బాస్కెట్‌బాల్ నన్నయ విశ్వవిద్యాలయ పురుషుల జట్టు**

వై.పవన్‌కుమార్, వి.అఖిల్‌కుమార్, ఎస్.వంశీ (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రామచంద్రపురం), టి.రాజేష్‌కుమార్, కె.సత్యనారాయణ, ఎస్‌కే అహ్మద్ ఆలీషా (డీఆర్‌కే రెడ్డి కళాశాల, జి.మామిడాడ), వి.సాయికిరణ్, ఎన్.ప్రవీణ్‌కుమార్, కేవీఎస్ కృష్ణారెడ్డి (ఎస్‌వీకేపీ కళాశాల, పెనుగొండ), బి.నీరజ్‌కుమార్ (సీఆర్‌ఆర్ కళాశాల, ఏలూరు), ఒ.రాజేష్ (పీఆర్ ప్రభుత్వ కళాశాల, కాకినాడ), సీహెచ్ అవినాష్ (సూర్యరాయ కళాశాల, పిఠాపురం), పి.అనిల్‌కుమార్ (ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం), ఎస్.జానకిరామ్ (ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం), కె.షాహిల్ (వీఎస్ఎం కళాశాల, రామచంద్రపురం).

## పూడ్చిపెట్టిన మృతదేహానికి పంచనామా

అక్రమ సంబంధం నేపథ్యంలో మధుని హతమార్చారని బంధువుల ఆరోపణ

పోలీసుల అదుపులో శిరీష, ప్రశాంత్

తొండంగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో వారం క్రితం మృతి చెందిన బత్తిన మధుబాబు (38) మృతదేహానికి అధికారులు శుక్రవారం శవ పంచనామా నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి మధుబాబు భార్య శిరీష, రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన పీతల ప్రశాంత్‌కుమార్... మధుబాబు ఇంట్లో కలిసి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు, బంధువులు పట్టుకున్నారు. వారిద్దరి మధ్య ఉన్న అక్రమ సంబంధం కారణంగానే మధుబాబును హత్యచేసి ఉంటారని, సహజ మరణం కాదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మధుబాబు (పాత చిత్రం)

ఇద్దరినీ పోలీసులకు అప్పగించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీతంపేట సమీపంలోని ఒక ఆసుపత్రిలో పనిచేస్తున్నపుడు శిరీష, ప్రశాంత్‌కుమార్ మధ్య ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారిందని, మానుకోవాలని మధుబాబు పలుమార్లు హెచ్చరించాడని బంధువులు పోలీసులకు తెలిపారు. తాజాగా భర్త మృతి చెందిన వారం గడవక ముందే శిరీష, ప్రశాంత్‌కుమార్ కలిసి ఉండడంతో వారే మధుబాబును అడ్డుతొలగించుకునే లక్ష్యంతో హత్య చేసి ఉంటారని అనుమానించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు శ్మశానంలో పూడ్చిపెట్టిన మధుబాబు మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. తొండంగి తహసీల్దారు మురార్జీ సమక్షంలో తుని ఏరియా ఆసుపత్రి వైద్యులు జగన్మోహన్, సాయికిరణ్ శవపంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. శిరీష, ప్రశాంత్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు.

## లారీ ఢీకొని వార్డు సభ్యుడి మృతి

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రంగంపేట మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోడెం నాగేశ్వరరావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు వివరాల ప్రకారం... నాగేశ్వరరావు బైక్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో దివాన్‌చెరువులోని పాతూరి రామాలయం వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. నాగేశ్వరరావు తలపై నుంచి వాహనం వెళ్లిపోవడంతో మెదడు ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు సంఘటనాస్థలానికి చేరుకుని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగేశ్వరరావు వెంకటాపురం పంచాయతీ 4వ వార్డు సభ్యుడని, గ్రామంలో అందరితో కలుపుగోలుగా వ్యవహరిస్తాడని సర్పంచ్ గంగరావు తెలిపారు.



నాగేశ్వరరావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

దసరాకు గ్రామంలో కిరాణా వ్యాపారం ప్రారంభించాడని... రాజమహేంద్రవరం వెళ్లి కిరాణా సరుకులు, కూరగాయలు కొనుగోలు చేసుకుని వస్తూ ప్రమాదానికి గురి కావడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొమ్మూరు ఎస్‌ఐ ఎస్‌పీ కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తండ్రికి అన్నీ తానై...

పాణింగపల్లిలో అంతిమ సంస్కారాలు నిర్వహించిన కుమార్తె

కె.గంగవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రికి అంతిమ సంస్కారాలు చేసి రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పాణింగపల్లికి చెందిన చేట్రాది సత్యనారాయణకు ఒక్కగానొక్క కుమార్తె వీరవేణి. ఆమెను కె.గంగవరం గ్రామానికి చెందిన నేమాని శ్రీనివాస్‌కు ఇచ్చి వివాహం చేయగా ఇద్దరు కుమార్తెలు జన్మించారు. విధి వక్రీకరించి పిల్లల చిన్న తనంలోనే శ్రీనివాస్ మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెలతో వేణు తండ్రి చెంతకు చేరుకుంది. ఇద్దరు పిల్లలను పెద్దచేసి వివాహాలు చేశారు. సత్యనారాయణ శుక్రవారం వయోభారంతో కన్నుమూశాడు. చిన్నతనం నుంచే తనను అల్లారు ముద్దుగా పెంచడమే కాకుండా తనకు వైధవ్యం కలిగిన తర్వాత పిల్లలను పెంచి పోషించి వారికీ పెళ్లిళ్లు చేసిన తండ్రి లోకం విడిచిపోవడంతో వీరవేణి కన్నీరుమున్నీరుగా విలపించింది. కొడుకులు లేని లోటు లేకుండా తానే కొడుకుగా మారి అంతిమ సంస్కారాలు నిర్వహించింది.



తండ్రి అంతిమ యాత్రలో పాల్గొన్న వీరవేణి

## ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి

పిఠాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ బాలాజీ రైసుమిల్లులో జరుగుతున్న షెడ్డు నిర్మాణ పనుల్లోకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన పుట్టి వెంకటరమణ వచ్చాడు. ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు రేకు తగిలి తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మరణించాడు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ పరిశీలించారు. మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## పిఠాపురంలో కల్తీ నెయ్యి తయారీ

మునిసిపల్, పోలీసు అధికారుల దాడులు

265 కిలోల పదార్థాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న జంతువుల కొవ్వు, డాల్డా, ఇతర సామాగ్రి

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో కల్తీ నెయ్యిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని పద్మావతినగర్‌లో ఓ ఇంట్లో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారన్న సమాచారంతో కమిషనరు కనకారావు ఆధ్వర్యంలో మునిసిపల్, పోలీసు సిబ్బంది శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తయారు చేసిన, తయారీకి సిద్ధంగా 12 టిన్నుల్లో, పలావు డేగిసాల్లో ఉన్న 265 కిలోల జంతువుల కొవ్వు, డాల్డా కల్తీ నెయ్యి, ఇతర పదార్థాలు, నెయ్యి తయారీకి వినియోగించే సామగ్రిని సీజ్ చేశారు. వీటితో కల్తీ నెయ్యి తయారు చేసి దీపాలు వెలిగించే నెయ్యిగా విక్రయిస్తున్నట్టు ఇంట్లో ఉన్న మహిళలు తెలిపారని కమిషనరు చెప్పారు. చట్టవిరుద్ధంగా తయారు చేస్తున్న నిర్వాహకుడు బండారు ఫణికుమార్‌పై కేసు నమోదు చేశారు.

### కిడ్నాప్ యత్నానికి పాల్పడిన తొమ్మిది మందిపై కేసు నమోదు

కొత్తపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో తన కూతురిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారంటూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన దంగేటి వెంకటరత్నం చేసిన ఫిర్యాదుతో తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్టు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. కోరుమిల్లికి చెందిన వెంకటరత్నం తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఈ నెల 20న ద్విచక్ర వాహనంపై తన పుట్టినిల్లు అయిన అంబాజీపేట మండలం ముక్కామల వెళ్లింది. అదే రోజు మధ్యాహ్నం కోరుమిల్లి బయల్దేరారు. కొత్తపేట సాయిబాబా గుడి సమీపానికి వచ్చేసరికి కోరుమిల్లికి చెందిన పోలిశెట్టి కృష్ణ అనే యువకుడు మరో ఎనిమిది మందితో కలిసి వారిని అడ్డగించి కుమార్తెను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. వారు కిడ్నాపర్ల నుంచి విడిలించుకుని కోరుమిల్లి వెళ్లి గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచన మేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర చెప్పారు.



రామాలయం ఆవరణలో దీక్ష కొనసాగిస్తున్న శివగణేష్, సూర్యచంద్ర, శ్రీదేవి

## పవన్ కల్యాణ్ నుంచి హామీ లభిస్తేనే దీక్ష విరమిస్తాం

- గుమ్మళ్లదొడ్డిలో నాలుగో రోజుకు నిరవధిక దీక్ష
- భగ్నం చేసేందుకు పోలీసుల యత్నం
- అడిషనల్ ఎస్పీతో చర్చలు విఫలం



దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సుబ్బరాజు

గోకవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ నుంచి తమకు హామీ లభిస్తేనే దీక్ష విరమిస్తామని కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మరోతి శివగణేష్, సామాజిక ఉద్యమ నేత పాటంశెట్టి సూర్యచంద్ర, ఆయన సతీమణి శ్రీదేవి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమను తొలగించాలని డిమాండ్ చేస్తూ బాధితులతో కలిసి వారు చేపట్టిన నిరవధిక దీక్ష శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. గుమ్మళ్ళదొడ్డి, అచ్యుతాపురం, బావాజీపేట, వెదురుపాక గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు మద్దతు తెలుపుతూ దీక్షలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా శివగణేష్, సూర్యచంద్ర మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పిస్తాం గాని ఇథనాల్ పరిశ్రమ నిర్వహణను గుమ్మళ్ళదొడ్డిలో కొనసాగనివ్వబోమన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ద్వారా ఈ విషయం పవన్‌కల్యాణ్‌కు చేరేలా యంత్రాంగం కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ పరిశ్రమ వల్ల ఇప్పటికే చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు అనేక రకాల శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందిపడుతూ ఆసుపత్రులపాలవుతున్నారని ఆవేదన చెందారు.

దీక్షా శిబిరాన్ని రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ ఏవీ సుబ్బరాజు, సీఐ రాంబాబు సందర్శించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కలెక్టర్ వచ్చి తమ ఇబ్బందులను స్వయంగా పరిశీలించి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ద్వారా సరైన హామీ ఇప్పిస్తేనే దీక్ష విరమిస్తామని బాధితులు వారికి చెప్పారు.

కాగా నిరవధిక దీక్షను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. దీంతో బాధితులు, ప్రజలు వారితో వాగ్వాదానికి దిగారు. ప్రాణాలకు తెగించి దీక్ష చేస్తుంటే దౌర్జన్యానికి దిగుతారా అంటూ ఆందోళనకారుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో పోలీసులు మిన్నకుండిపోయారు. రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకుని దీక్షను కొనసాగిస్తున్నారు.

ఇథనాల్ పరిశ్రమ నుంచి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, తక్షణం ఇక్కడి నుంచి తొలగించాలని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పాలకవర్గం తరపున తీర్మానం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని సర్పంచ్ శరకణం రామలక్ష్మి తెలిపారు.

### విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) విభాగ్ కన్వీనర్ సత్యసాయి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. రెండు రోజులు జరిగే ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవుతారని, పలు అంశాలపై చర్చిస్తామని సత్యసాయి చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి అభిషేక్, మహిళా కన్వీనర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



### భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం ఏర్పాటుచేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. మాచవరంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించారు. భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలించారు.

### అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి

అల్లవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రైడేగా నిర్వహించాలని ఆదేశించారు.

## కోనసీమ రైతు సంఘం అధ్యక్షుడిగా వెంకటరెడ్డి



వెంకటరెడ్డిని సత్కరిస్తున్న రైతు నాయకులు

ఉప్పలగుప్తం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జేకేఎస్ రైతు సంఘం కోనసీమ అధ్యక్షుడిగా గొలకోటి వెంకటరెడ్డిని నియమిస్తూ జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు కర్ల మురళీకృష్ణనాయుడు ఆదేశాలిచ్చినట్టు జేకేఎస్ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బసవా చినబాబు తెలిపారు. కూనవరంలో శుక్రవారం చినబాబు ఆధ్వర్యంలో వెంకటరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో జేకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిక్కా శేషబాబు, జేకేఎస్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి బాబులు పాల్గొన్నారు.

## రేపు రత్నాకర్ రెండవ సంపుటి ఆవిష్కరణ

యానాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యానాం రచయిత రత్నాకర్ పెనుమాక రచించిన రెండవ కథా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 27న యానాంలో జరుగనుంది. ఇటీవల ప్రపంచస్థాయి కథల పోటీ ప్రథమ బహుమతి పొందటమే కాకుండా తన మరో కథను ఆంధ్రప్రదేశ్ అంతటా డిగ్రీ ఫైనలియర్ పాఠ్యాంశంగా ఎంపికైన యానాం రచయిత రత్నాకర్ 27న ఆదివారం సాయంత్రం భీమనగర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈసభకు ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు అధ్యక్షత వహించనున్నారు. పుస్తకం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆవిష్కరించనున్నారు. తొలి ప్రతి పోనుగుమట్ల విష్ణుమూర్తి స్వీకరించనున్నారు. కార్యక్రమానికి ప్రముఖ కవులు ముదునూరి సత్యనారాయణమూర్తి, ఆవధానుల మణిబాబులు, రత్నజంయ్ హాజరుకానున్నారు.

## అడివిపాలెంలో సర్వే వద్ద ఘర్షణ

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అడివిపాలెంలో పంచాయతీకి చెందిన చెరువు సర్వే నెం. 545/5లో 1.96 ఎకరాల భూమి సర్వేను శుక్రవారం అధికారులు చేపట్టారు. ఇరు వర్గాలకు చెందినవారు ఒకరిపై ఒకరు దూషణల పర్వానికి దిగడంతో కందికట్ల శశికుమార్, యడ్ల రత్నలకు గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ పి.సురేష్‌లు సందర్శించారు. ఎటువంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు.

## సీసీరోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో పాల్గొన్న నాయకులు

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మలికిపురంలో రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ ఎంవీ సత్యవాణి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎన్డీఏ హయాంలో రోడ్లకు మహర్దశ పడుతుందని అన్నారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, కాకి లక్ష్మణ్, పిండి సత్యనారాయణ, గెడ్డం తులసీభాస్కర్, జంపన సత్యనారాయణరాజు, కార్యదర్శి సుభాకర్, రవికిరణ్ పాల్గొన్నారు.

## దేవగుప్తంలో గుడి, షాపులో చోరీలు

అల్లవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం జడ్పీ హైస్కూలు పరిధిలోని కనకదుర్గ ఆలయంలో హుండీ, బట్టల షాపులో నగదును గురువారం రాత్రి దొంగలు చోరీ చేశారు. హుండీ సొమ్ము దొంగతనంపై ఆలయ కమిటీ, బట్టల షాపులో చోరీపై తిక్కా భద్రం శుక్రవారం అల్లవరం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

# మరమ్మతులకు నోచుకోని బాలికల వసతి గృహం



కుంగి దెబ్బతిన్న వరండా ఫ్లోరింగ్

- కుంగిన టైల్స్.. దెబ్బతిన్న వరండా ఫ్లోరింగ్, ఊడిపోయిన బాత్‌రూమ్ తలుపులు
- రాజోలు బాలికల వసతి గృహాన్ని ఆధునికీకరించాలని కోరుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

రాజోలు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి) : రాజోలు జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వెనుకవైపున ఉన్న ఆంధ్రప్రదేశ్ సంక్షేమశాఖ సమీకృత సంక్షేమ బాలికల వసతిగృహాన్ని 2007లో అప్పటి రాష్ట్రసాంఘిక సంక్షేమశాఖ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ శంకుస్థాపన చేశారు. సమీకృత బాలికల వసతిగృహాన్ని రూ.1.68 కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాన్ని 2011లో అప్పటి జడ్పీ చైర్మన్ చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ వసతిగృహంలో పి.గన్నవరం, అల్లవరం, కాట్రేనికోన, అయినవిల్లి, ఆత్రేయపురం, మలికిపురం, సఖినేటిపల్లి, ఆచంట మండలాలకు చెందిన 145 మంది బాలికలు చేరారు. మూడో తరగతి నుంచి 10వ తరగతికి చెందిన బాలికలంతా వసతిగృహం సమీపంలో ఉన్న జిల్లాపరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల పనివేళల్లో ఈ విద్యార్థినులు వెళ్లి పాఠశాల సమయంకాగానే మరలా వసతిగృహానికి చేరుకుంటారు. ఈ వసతిగృహంలో ఎనిమిది నివాస గదులు ఉండగా మూడు గదుల్లో మాత్రమే బాలికలు ఉపయోగిస్తారు. మిగతా గదుల్లో టైల్స్ కిందకు దిగబడిపోయి కుంగిపోయాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇసుక బయటకు వచ్చి పుట్టలు వేశాయి. కిటికీలకు దోమల మెస్‌లు పాడైపోయాయి. ఎలక్ట్రికల్ వైరింగ్ మరమ్మతులకు గురయ్యాయి. దీంతో విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారు. తలుపులు కిటికీలకు చెదలు పట్టి పాడవుతున్నాయి. ఎక్కడ ఏ సమయాన కీటకాలు, దోమలు వస్తాయో అన్న భయంతో బిక్కుబిక్కుమంటూ బాలికలు కాలం వెళ్లదీస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ వసతిగృహంలో బాలికలకు 19 టాయిలెట్లు, 19 మరుగుదొడ్లు ఉన్నాయి. బాత్‌రూమ్‌ల తలుపులు ఊడిపోయాయి. పైపులైన్లు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి వసతిగృహానికి నిధులు కేటాయించి ఆధునికీకరించాలని బాలికల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



రాజోలు సాంఘిక సంక్షేమశాఖ సమీకృత సంక్షేమ బాలికల వసతిగృహం



తలుపులు ఊడిపోయిన బాత్‌రూమ్‌లు

## యానిమేటర్ల సొమ్ముల స్వాహాపై విచారణ జరపాలి

అమలాపురంరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాలగుమ్మిలో డ్వాక్రా మహిళా సంఘాలు చెల్లించిన సొమ్ములను స్వాహా చేసిన యానిమేటర్ల వ్యవహార తీరుపై తక్షణం విచారణ జరిపి స్వాహా చేసిన సొమ్ములను తిరిగి రికవరీచేసి ఆదుకోవాలని డ్వాక్రా మహిళలు అధికారులను డిమాండ్ చేశారు. పాలగుమ్మిలో స్త్రీనిధికి చెల్లించాల్సిన రుణాల సొమ్ములతో పాటు ఎస్సీ ఎస్టీ మహిళల కోసం కేటాయించిన ఉన్నతి నిధుల చెల్లింపు, బ్యాంకు లింకేజీ రుణాల చెల్లింపులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డ్వాక్రా మహిళలు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం మెయిన్ రోడ్డులో శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగి అనాతవరం గ్రామానికి చెందిన మోటారు సైకిలిస్టు కొడమంచిలి సత్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వచ్చిన మోటారు సైకిల్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. హుటాహుటీన సత్యనారాయణను ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ కిశోర్‌బాబు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు



మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్

ముమ్మిడివరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేయడం ద్వారా మంచి మార్కెట్‌ను పొంది అధిక లాభాలు సాధించవచ్చునని వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా గ్రూపు సభ్యులు తయారుచేసిన పలు ఉత్పత్తులకు సంబంధించి 30 రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి కమిషనర్ వీవీ సుధాకర్ పరిశీలించారు. ప్రతీనెలా మెప్మా అర్బన్ మార్కెట్‌ను ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకే ఈ మార్కెట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెల్లి అశోక్, పిల్లి నాగరాజు, మెండి కమల, సీఎంఎంఎస్ భాస్కర్, కోఆర్డినేటర్ రాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, పంచాయతీ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచారం



కూటమి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద శుక్రవారం కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఆనందరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కూటమి ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించి శాసనమండలికి పంపించేందుకు పట్టభద్రులను సన్నద్ధం చేయాలని సూచించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడస్వామినాయుడు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీనుతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్ మాట్లాడారు. పరిశీలకునిగా పులివెందులకు చెందిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. కూటమి నేతల సమావేశంలో నాయకులు అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, లింగోలు పండు, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు అధికారి జయవెంకటలక్ష్మి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మండల, పట్టణశాఖ అధ్యక్షులు మల్లుల పోలయ్య, దెందుకూరి సత్తిబాబురాజు, తిక్కిరెడ్డి నేతాజీ, చొల్లంగి సత్యసాయిబాబా పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు దేవగుప్తం విద్యార్థిని ఎంపిక



గూడవల్లి రక్షిత

అల్లవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం జడ్పీ హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న గూడవల్లి రక్షిత జిల్లాస్థాయి షాట్‌పుట్ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రాజమహేంద్రవరంలో అండర్-14 విభాగంలో జరిగిన స్కూలు ఫెడరేషన్ పోటీల్లో రక్షిత జిల్లా స్థాయిలో ప్రథమస్థానం కైవసం చేసుకుంది. 7.70 మీటర్ల మేర షాట్‌పుట్ బంతిని విసిరి విజేతగా నిలిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ రాజ్ కుమార్‌ను విజేత గూడవల్లి రక్షితను హైస్కూలు హెచ్ఎం ఎస్.వేణుగోపాలస్వామి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

## డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

అమలాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బండారులంకలో గత 15 రోజులుగా చెత్త సేకరణ పనులు నిలిచిపోవడంతో ప్రజారోగ్యం దెబ్బతింటుందని, తక్షణం డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామస్తులు మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, సర్పంచ్ పెనుమాల సునీతతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఎక్కడికక్కడ రోడ్లకు ఇరువైపులా చెత్త పేరుకుపోయిందని, అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వివరించారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డీఆర్వో తెలిపారు. అనంతరం గ్రామస్తులు హౌసింగ్ బోర్డు కాలనీలోని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు క్యాంపు కార్యాలయానికి చేరుకుని గ్రామస్తుల సమస్యను వివరించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మాడా మాధవి, కూటమి నాయకులు బట్టు పండు, కాశిన ఫణీంద్ర, దైవపు పూర్ణిమ, పుత్సల కుమారగణేష్‌తో పాటు పంచాయతీ వార్డు సభ్యులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చందన శంకరరావు, పెనుమాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామసభ రసాభాస..

చెత్త సమస్య పరిష్కారానికై బండారులంక పంచాయతీ కార్యాలయంవద్ద శుక్రవారం సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. చెత్త సమస్యకు మీ పార్టీ కారణమంటే మీ పార్టీ కారణమంటూ వివాదాలకు దిగడంతో గ్రామసభ రసాభాసగా మారింది. ఒకదశలో పంచాయతీవార్డు సభ్యులు అంకం పెదరాజు, జాన గణేష్‌లకు వాగ్వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి అదుపు తప్పుతుందని గ్రహించిన స్థానికులు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబుకు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి ఆయన పంచాయతీ కార్యాలయం వద్దకు హుటాహుటీన చేరుకున్నారు.

## పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

అమలాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల స్థాయిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను త్వరలో జరిగే ఎన్నికల్లో గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని పేరూరు, కామనగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు సమనస గురుకుల పాఠశాల, ఎ.వేమవరం, ఇందుపల్లి, సాకుర్రు, బండారులంక జడ్పీ హైస్కూలులో ఉపాధ్యాయులతో ఆయన సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇప్పటికే బొర్రా గోపీమూర్తిని ప్రకటించామని, త్వరలోనే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. ఎ.వేమవరం హస్కూలులో మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

ముమ్మిడివరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం నగర పంచాయతీ రాజుపాలేనికి చెందిన తాడాల దుర్గాప్రసాద్ (25) తల్లిదండ్రులతో కలిసి ముమ్మిడివరం పోలీస్‌క్వార్టర్స్ వెనుక నివశిస్తున్నాడు. అతను ఆప్టిండ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దుర్గాప్రసాద్‌కు సోదరి ఉంది. ఆమె అనారోగ్యానికి గురవ్వడంతో ఇంటి వద్దే ఉండి వైద్యసేవలు పొందుతుంది. ఆమె వైద్య సేవలకు డబ్బులు లేకపోవడంతో దుర్గాప్రసాద్ తల్లిదండ్రులు సొమ్ములు ఇవ్వడంలేదని అతడిని మందలించడంతో ఈ నెల 23న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికిలోకి వెళ్లాడు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ బి.జ్వాలాసాగర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

రావులపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రాజెక్టు గ్రామసభలను వినియోగించుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరావు సూచించారు. దేవరపల్లి పంచాయితీ కార్యాలయంవద్ద భూసమస్యలపై నిర్వహించిన గ్రామసభలో పలు అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం రికార్డులు ఆధారంగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈగ్రామసభలో 91 అర్జీలు రైతులు వద్ద నుంచి వచ్చినట్టు తహశీల్దార్ తెలిపారు.

## కొనసాగుతున్న ఉద్యోగుల ఆందోళన

యానాం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాపనులశాఖలో పనిచేస్తున్న సిబ్బంది చేస్తున్న ఆందోళన మూడోరోజు కొనసాగింది. కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి ప్రజాపనులశాఖలోని పీటీఎస్ ఉద్యోగుల కోసం ప్రకటించిన 18వేల రూపాయలను తక్షణమే ఇచ్చే విధంగా వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీపావళికి ముందే బోనస్, జీతాలు ఇవ్వాలని కోరారు. వెంటనే ప్రభుత్వ స్పందించి తమకు న్యాయమైనా సమస్యలను తీర్చాలని ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## రెండు జిల్లాల సైన్స్‌ఫైర్‌లో గోడి విద్యార్థినుల ప్రతిభ

అల్లవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల స్థాయిలో పిఠాపురంలో శుక్రవారం జరిగిన జూనియర్ సైన్స్‌ఫైర్‌లో అల్లవరం మండలం గోడి గురుకుల పాఠశాల విద్యార్థినులు తమ సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. బ్లోబెరిల్లా మేజికల్ అంబ్రెల్లా సైన్స్ ప్రదర్శనలో 8వ తరగతి విద్యార్థినులు ఉప్పే ఏంజెల్, కె.సాల్వినాలు జిల్లాస్థాయిలో ద్వితీయస్థానం సాధించారని గైడ్ కనపర్తి మౌనిక తెలిపారు. కలర్ పేపర్ క్రాఫ్ట్ పోటీల్లో గురుకుల విద్యార్థినులు ఎస్.హారిక, పి.సౌజన్యలు మొదటి స్థానం సాధించారని క్రాఫ్ట్ టీచర్ బడుగు బేబి తెలిపారు. విజేతలను గురుకుల ప్రిన్సిపాల్ కిరణ్మయి, ఉపాధ్యాయులు అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

రాజోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్, ఇండస్ట్రీయల్ సందర్శనలో భాగంగా రామేశ్వరం హైస్కూలు విద్యార్థులు శుక్రవారం వేగివారిపాలెం, తాటిపాకలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తూ వ్యవసాయం చేస్తున్న రైతుల ఏ గ్రేడ్ మోడల్ విజిటబుల్ ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. రసాయన ఎరువులు వాడకుండా వ్యవసాయం చేసే విధానాలకు కావాల్సిన ఇన్‌పుట్ మెథడ్స్ ఫీల్డ్ విజిట్‌లో విద్యార్థులకు అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, ఎన్ఏఫ్ఏ హేమలత, ఎన్ఎఫ్ఏ హెచ్ఆర్ జోన్స్ వివరించారు. కార్యక్రమంలో స్కూలు హెచ్ఎం ఎంజీకే శ్రీనివాస్, వ్యవసాయాధికారులు డి.కిరణ్‌కుమార్, మేథ్సా సీఆర్ రాజేష్, ప్రదీప్, వైస్‌చైర్మన్ తులసీరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోసెఫ్, శ్రీనివాస్, జూలీ, చిట్టిస్వరాజ్, మల్లికా ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

**అంతర్వేది:** సఖినేటిపల్లి మండల రామేశ్వరం హైస్కూలు ప్లస్ విద్యార్థుల అగ్రికల్చర్ సందర్శనలో భాగంగా ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలకు శుక్రవారం తీసుకువెళ్లారు. వేగివారిపాలెంలో ఉన్న ప్రకృతి వ్యవసాయ మోడలైన ఏటీఎం మోడల్‌ను చూపించి వాటి ఉపయోగాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రధానంగా నిరంతరం రైతుకు ఆదాయం రావడం, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. 50మంది విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నట్టు ప్రధానోపాధ్యాయుడు ఎంజీకే శ్రీనివాస్ తెలిపారు.

## కె.ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్‌లో మద్యం షాపు తొలగించాలి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి

పి.గన్నవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో అక్విడెక్టు దిగువన కె.ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్‌లో ఏర్పాటుచేసిన బ్రాందీషాపును వెంటనే తొలగించాలని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహ శీల్దార్, ఎంపీడీవోలతో పాటు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కె.ఏనుగుపల్లి ఏటిగట్టు రోడ్డులో ఆర్.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ఏనుగు పల్లితో పాటు పలు గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయని ఏటిగట్టు సెంటర్‌లో బ్రాందీషాపు ఏర్పాటుచేయడంతో ఆప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయంత్రం సమయంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గన్నవరం హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు సైతం ఇదే సెంటర్ మీదుగా రాకపోకలు సాగించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇదే విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్, కొత్తపేట ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందించామన్నారు. ఆయా గ్రామాల ప్రజల బాధలను దృష్టిలో ఉంచుకుని ఏటిగట్టు సెంటర్ లో బ్రాందీషాపును తొలగించి మరోచోటకు మార్చే విధంగా చూడాలని అధికారులను కోరుతున్నట్లు స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, దొమ్మేటి పార్వతి, తోరం వీరవెంకటసత్యనారాయణ, ఎంపీటీసీలు యాండ్ర విజయ లక్ష్మి, కొల్లి సూర్యనారాయణ, దొమ్మేటి శివరామన్ ఉన్నారు.

### బ్రాందీషాపు ఏర్పాటుపై నిరసన

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గూడపల్లి ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్డు పక్కన బ్రాందీ షాపు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఇక్కడ షాపు నిర్వహించడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో కొణిదెల శ్రీనివాసరావు, కుడుపూడి పండు, కె.సుబ్బరాజు, కాపిశెట్టి నానాజీ, పాటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

### నేడు మండల పరిషత్ సమావేశం

ఆలమూరు, అక్టోబరు 25: ఆలమూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.జాన్‌లింకన్ తెలిపారు. ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

### గాంధీనగర్‌లో అన్నసమారాధన

మండపేట, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణంలోని గాంధీనర్ రైతుబజార్‌వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఏటిగట్టుపై ప్రయాణం

# నరకయాతనే!

- అధ్వానస్థితిలో పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కపిలేశ్వరపురం వద్ద అధ్వానంగా మారిన ఏటిగట్టు రహదారి



వెదురుమూడి వద్ద ప్రమాదభరితంగా రహదారి

కపిలేశ్వరపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండలంలోని పలు పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రహదారులు అధ్వానస్థితికి చేరుకోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కపిలేశ్వరపురం నుంచి అంగర, వెదురుమూడి, వల్లూరు మీదుగా మండపేటకు వెళ్లే రహదారులు, నల్లూరు నుంచి టేకి వెళ్లే రహదారి, కపిలేశ్వరపురం నుంచి జొన్నాడ, కపిలేశ్వరపురం కోటిపల్లి వెళ్ళే ఏటిగట్టు రహదారి, పలుచోట్ల చిద్రంగా మారింది. ఆయా రహదారి మార్గంలో రాళ్లు పైకి లేచిపోవడం, గుంతలు పడి నీరు నిల్చిపోవడం, రహదారులు ఇరువైపులా మార్జిన్‌లు దిగబడిపోవడం, కోతకు గురవడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. పలుచోట్ల వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రులపాలైన సంఘటనలు అనేకం. ఆయా రహదారుల్లో ప్రయాణించేందుకు వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళనలతో ప్రయాణాలు సాగిస్తున్నారు. భారీ ఇసుక వాహనాలు కారణంగా ఏటిగట్టు రహదారి పలుచోట్ల దిగబడిపోయింది. గుంతలుపడి అధ్వానంగా మారింది. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలకే ముప్పు అన్న చందగా తయారైంది. సంబంధితశాఖ అధికారులు తక్షణం స్పందించి రహదారులను మెరుగుపర్చాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

## ఆలమూరు కోర్టు ఏజీపీగా విద్యాప్రసన్న



ఆలమూరు ఏజీపీగా నియమితులైన విద్యాప్రసన్న

ఆలమూరు, అక్టోబరు 25ఆంధ్రజ్యోతి): ఆల మూరు జూనియర్ సివిల్‌కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ప్రముఖన్యాయవాది బూసి విద్యాప్రసన్న నియమితులయ్యారు. విద్యాప్రసన్నను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ సెక్రటరీ టూ గవర్నమెంట్ (ఎఫ్ఏసీ) వి.సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె మూడేళ్లపాటు ఈపదవిలో కొనసాగుతారు. ప్రభుత్వపరంగా వచ్చే లీగల్ సమస్యలతోపాటు బడుగు బలహీన వర్గాలకు న్యాయ సలహాలు అందిస్తామని ఏజీపీగా నియమితులైన విద్యాప్రసన్న తెలిపారు. విద్యాప్రసన్నను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

## ఓఎన్జీసీలో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి



రెవెన్యూ సదస్సులో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గత నాలుగు దశాబ్దాలుగా ఈప్రాంతంలో ఒఎన్జీసీ కార్యకలాపాలు నిర్వహించి ఎంతో విలువైన గ్యాస్, చమురు నిల్వలను తరలిస్తుండగా కనీసం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోవడం అన్యాయమని ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సులో గ్రామస్తులు తహశీల్దార్ కెజె.ప్రకాష్‌బాబుకు వినతి పత్రం అందించారు. పెదపళ్ల గ్రామ పరిధిలో జీసీఎస్ ద్వారా దశాబ్దాల కాలంలో సహజ వాయువు, చమురు నిల్వలను తరలిస్తుండగా ఈప్రాంతంలో భూగర్భజలాల నిల్వలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్థానికులకు కనీస ఉద్యోగాలు కల్పించకపోవడం అన్యాయమని తక్షణం జీసీఎస్‌లో ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందించారు. ఈసదస్సులో పలు రెవెన్యూ సదస్సులపై వినతిపత్రాలు అందించారు. ముఖ్యంగా గత ప్రభుత్వ కాలంలో చేపట్టిన సర్వేలో అధికంగా తేడాలు ఉన్నాయని వాటిని తక్షణం సవరించాలని రైతులు కోరారు. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని తహశీల్దార్ ప్రకాష్‌బాబు హామీఇచ్చారు.

## కూటమి సత్తా మరోసారి చూపిద్దాం : మంత్రి సుభాష్



సమావేశంలో మాటాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు25 (ఆంధ్ర జ్యోతి): ఉభయగోదావరి గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక ల్లో కూటమి సత్తా మరోసారి చూపిద్దామని ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకుందామని మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం స్థానిక లయన్స్ కల్యాణమండపంలో జరిగిన ఎన్‌డీఏ కూటమి నాయకులు విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడారు. విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు అన్నివర్గాలవారు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయానికి కృషి చేశారన్నారు. అదే ఒరవడితో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపంచాలన్నారు. నిరుద్యోగ నిర్మూలనకు మెగా డీఎస్సీ ప్రకటించి 16430 పోస్టులు భర్తీచేసేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. 2794 కోట్లు బారం పడుతున్నా దీపావళి నుండి అర్హులైన వారికి ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు అందచేస్తామన్నారు. నియోజకవర్గానికి ఒక ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన పట్టభద్రులు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, బీజేపీనాయకులు కర్రిచిట్టిబాబు, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్, పెంకె సాయిబాబ, పిల్లా వెంకట్రావు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు కడియాల రాఘవన్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు అధిక సంఖ్యలో టి.డి.పి, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అఖిల



రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం ఆర్డీవోగా దేవరకొండ అఖిల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లిగూడెం నుంచి అఖిల బదిలీపై రామచంద్రపురం వచ్చారు. రామచంద్రపురం ఆర్డీవోగా పనిచేస్తున్న ఖతీజ్ కౌసర్ బానో తాడేపల్లిగూడెం బదిలీ అయ్యారు.

### సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థికసాయం చెక్కులను శుక్రవారం మంత్రి సుభాష్ అందచేశారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉండూరు గ్రామానికి చెందిన అనుసూరి రాంబాబుకు రూ.40 వేలు, రామచంద్రపురం పట్టణానికి చెందిన గుత్తుల ముత్యాలరాజుకు రూ.75699 చెక్కులను మంత్రి సుభాష్ అందచేశారు.

### మద్యం సేవించిన మందుబాబుకు జైలు

మండపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి పట్టుపడిన కేసులో 15 రోజులపాటు జైలుశిక్ష పడిందని మండపేట రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...ద్వారపూడి గ్రామంలో వున్న బస్టాండ్ వద్ద మద్యం సేవించిన వారి వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్వారపూడికి చెందిన లచ్చిరెడ్డి పృథ్వీకుమార్ మద్యం సేవించి పట్టుపడ్డాడని తెలిపారు. అతన్ని ఆలమూరు కోర్టులో హాజరుపరచగా శుక్రవారం 15 రోజులపాటు శిక్షపడిందని ఆయన చెప్పారు.

## పశుసంపదను కాపాడుకోవాలి

- మంత్రి సుభాష్



పశుగణన పోస్టర్‌ను అవిష్కరిస్తున్న మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ)అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి):మన జీవనవిధానంలో భాగమైన పశుసంపదను కాపాడుకోవాలని మంత్రి సుభాష్ అన్నారు. శుక్రవారం మంత్రిక్యాంపు కార్యాలయంలో పశుగణన కార్యక్రమాన్ని పశుసంవర్థక శాఖ అధికారులతో కలసి మంత్రి ప్రారంభించారు. పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పశుగణన శుక్రవారం ప్రారంభమై 2025 ఫిబ్రవరితో ముగుస్తుందని తెలిపారు. అదేవిధంగా పశుసంపదను బట్టి బడ్జెట్ కేటాయింపులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ ఓ.రామకృష్ణ, డాక్టర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### 21వ పశుగణన పోస్టర్ ఆవిష్కరణ

మండపేట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో వ్యవసాయం తర్వాత పెద్దపీట పాడి పరిశ్రమదేనని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా పశుగణనకు సంబంధించి ఈయేడాది అక్టోబర్ 25నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు పశుగణన జరుగుతుందని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న 21వ పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించా రు. పశుసంవర్ధకశాఖ వైద్యుడు రాజ్‌కుమార్, ఎంపీడీవో సత్యనారా యణమూర్తి, గీసాల సత్తిబాబు, కుక్కలరామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### పాడి పరిశ్రమ అభివృద్ధికి పశుగణన దోహదం

కె.గంగవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పశుగణనతో పాడి, పౌల్ట్రీ పరిశ్రమతో పాటు, పశుసంపద అభివృద్ధి చేయడానికి అవకాశం కలుగుతుందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. శుక్రవారం పామర్రులో 21వ భారతదేశ పశుగణన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేటి నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పశుగణన జరుగుతుందని పామర్రు పశువైద్యాధికారిణి ఎం.బిందు చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, పెన్నాడ త్రిమూర్తులు, గ్రామ కార్యదర్శి ఎం.సీతారామయ్య, వీఆర్‌వో భద్రరావు, వాసంశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### బాణసంచా విక్రేతలు నిబంధనలు పాటించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలని డీఎస్పీ బి.రామకృష్ణ కోరారు. ఆయన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నేటిపై ప్రాంతాల్లో మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేయాలని నిబంధనలు పాటించని విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్, అగ్నిమాపకదళ అధికారి నాగేశ్వరరావు, బాణసంచా విక్రయ లైసెన్సుదారులు పాల్గొన్నారు.

### నేడు మహిళాశక్తి భవనం ప్రారంభం

మండపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గొల్లపుంతకాలనీలో డ్వాక్రా, మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించిన భవనాన్ని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్‌లు అంతా హాజరు కావాని ఆయన కోరారు. అలాగే మండపేటలో జరిగే మెప్మాకార్యక్రమానికి రాష్ట్ర మెప్మాఎండీ రానున్నారని కమీషనర్ తెలిపారు. ఎండిరానున్న నేపద్యంలో డ్వాక్రామహిళలతో సమీక్ష సమావేశం కూడాజరుగుతుందని ఆయన వెల్లడించారు..

### బాలిక అదృశ్యంపై ఫిర్యాదు



ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చెముడులంకలో బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. చెముడులంక గ్రామానికి చెందిన కె.హాసిని(16) జడ్పీహైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఈనెల 23న ఇంటి నుంచి స్నేహితులతో స్కూల్‌కు వెళ్లింది. అక్కడికి వెళ్లకపోవడంతో టీచర్లు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినప్పటికీ కనిపించకపోవడంతో ఆలమూరు పోలీసులకు తండ్రి రాజు ఫిర్యాదు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చింతలూరులో గన్ని కృష్ణారావు(74) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. చింతలూరు వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉంటున్న కృష్ణారావు గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆలమూరు పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 6302057258, 9440904849లో సమాచారం అందించాలని కోరారు.

### గ్రామసభలతో భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

రావులపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రాజెక్టు గ్రామసభలను వినియోగించుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని రావులపాలెం తహశీల్దార్ ముక్తేశ్వరావు సూచించారు. దేవరపల్లి పంచాయితీ కార్యాలయంవద్ద భూసమస్యలపై నిర్వహించిన గ్రామసభలో పలు అర్జీలను స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాలనుసారం రికార్డులు ఆధారంగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈగ్రామసభలో 91 అర్జీలు రైతులు వద్ద నుంచి వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

### వాకతిప్ప పీహెచ్‌సీలో విచారణ

కపిలేశ్వరపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యవతిపై వచ్చిన ఫిర్యాదుపై అడిషినల్ డీఎంఅండ్ హెచ్‌వో భరతలక్ష్మి శుక్రవారం విచారణ చేపట్టారు. సూపర్‌వైజర్ రెగ్యులర్‌గా విధులకు హాజరుకావడంలేదంటూ అందిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపేందుకు వచ్చినట్లు అడిషినల్ డీఎం అండ్ హెచ్‌వో భరతలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఏఎన్ఎంలు, ఆశాలు నుంచి లిఖిత పూరకంగా వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు అసౌకర్యం రాకూడదు



సోమేశ్వరంలో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌కుమార్

రాయవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులకు అసౌకర్యం కలగకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా గ్రామస్థాయిలో సిబ్బంది కృషి చేయాలని ఆలమూరు సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ రమేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం సోమేశ్వరం గ్రామంలో సబ్ డివిజన్ పరిధిలో నాలుగు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి అవగాహన జరిపారు. రాష్ట్రీయ వికాస యోజన (రాప్తార్) పథకం శిక్షణ నిర్వహించారు. ఏవో కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రైతుకు నచ్చిన రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకువెళ్లేలా ఏర్పాటు చేయాలన్నారు. వరిపంటలో యాజమాన్య పద్ధతులపై వివరించారు. వెంటూరు గ్రామ వ్యవసాయ అధికారిగా పనిచేసి పదోన్నతిపై విస్తీర్ణ అధికారిగా కె.గంగవరం మండలానికి బదిలీపై వెళుతున్న హేమంత్‌ను పదోన్నతిపై ఏఈవోగా వచ్చిన అడపా శివశంకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఏసుబాబు, లావణ్య నాలుగు మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కె.గంగవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): భూసర్వే వలన ఏర్పడిన సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అన్నారు. శుక్రవారం పామర్రులో జరిగిన సదస్సును ఆమె ప్రారంభించి మాట్లాడారు. మండల సర్వేయర్ పావని మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో మేన్యువల్ ప్రకారం తయారు చేసిన రికార్డులను ఇప్పుడు ఆధునిక సాంకేతికతో భూసర్వే చేసి రికార్డులు తయారు చేయడం వలన కొన్ని హెచ్చుతగ్గులు వచ్చాయి. వాటిని సరిచేసుకోవడం కోసం ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. రైతుల నుంచి వచ్చిన దరకాస్తులను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట్రావు, వీఆర్‌వో భద్రరావు, సర్పంచ్ అనసూరి వెంకటదుర్గ సూరిబాబు, ఎంపీటీసీ సాదే సత్యవతి, సాదే కపిల్, కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, పెన్నాడ త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరాష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్లమూరు పంచాయతీ కార్యాలయంవద్ద గ్రామసర్పంచ్ చుండ్రు మంగాయమ్మ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ సర్వేలో సమస్యలేమైనా ఉన్నట్లయితే రైతులు దరఖాస్తు చేసుకోవాలని నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చుండ్రు వెంకట్రావు, పుట్టా వెంకన్నబాబు, వీఆర్‌వో కరీం, గ్రామపెద్దలు, రైతులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### వక్ఫ్ పరిరక్షణ మనందరి బాధ్యత

మండపేట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ మన బాధ్యత అనే అంశంపై జమాతే ఇస్లామీ ఆంధ్రప్రదేశ్ తరపున విజయవాడలోని కుమ్మరలోవలో నవంబరు 3న రాష్ట్రస్థాయిలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. చిన్నమసీదువద్ద శుక్రవారం విజయవాడలో జరిగేసభకు సంబంధించిపోస్టర్‌ను సంఘ నేతలు ఆవిష్కరించారు.

### ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్ వంటి కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. శుక్రవారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు అధ్యక్షతన ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

### విద్యార్థుల అపార్ డేటాను త్వరితగతిన పూర్తిచేయాలి

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అపార్ (ఆటోమెటిడ్ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్ట్రీ) డేటాను త్వరితగతన పూర్తి చేయాలని సమగ్రశిక్ష అభియాన్ డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధి గంటి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల డేటాను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరును పరిశీలించి అనంతరం వారికి అందుతున్న తాగునీరు, టాయిలెట్లను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించడంతో పాటు ఆయన రుచి చూశారు. అపార్ డేటా ప్రోగ్రెస్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొబలైజేషన్ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం, హెచ్ఎం బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రికార్డును తనిఖీ చేస్తున్న సర్వశిక్షాభియాన్ డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు

### 'ఆచరణ సాధ్యంకాని టార్గెట్లు నిలిపివేయాలి'

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆచరణ సాధ్యం కాని అశాస్త్రీయమైన టార్గెట్లను నిలిపివేయాలని తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం సాయంత్రం తపాలా కార్యాలయంవద్ద తపాలా ఉద్యోగులు నిరసన తెలిపారు. గత మూడు రోజులుగా తపాలాశాఖలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారం కోరుతూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు. 8వ వేతన సవరణకమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అన్ని క్యాడర్‌లో ఉన్న ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని, కమలేష్ చంద్రకమిటీ సిఫార్సులు అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండపల్లి సూర్యనారాయణ, రాంబాబు, సాయికృష్ణ, రామారావు, రాయుడు, గణపతి, గంగరాజు, గౌతమ్, సీతామహాలక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.